సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక

సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.
శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈవో
సెల్ నెంబర్ : 9052045 435,9542522611.

జాతీయ తెలుగు దినపత్రిక RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు




| మంగళవారం 31 మార్చి 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 302 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|

## సన్నబియ్యం పథకం విజయవంతం – రైతులకు లాభం, పేదలకు నాణ్యమైన ఆహారం: సీఎం రేవంత్ రెడ్డి

### రేషన్‌లో సన్నబియ్యం పంపిణీతో బ్లాక్ మార్కెట్ నియంత్రణ – 86% ప్రజలకు లాభం





సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 31, ప్రతినిధి: రైతులు పండించే పంటలకు సరైన ధర నిర్ణయించే అధికారం లేకపోవడం వల్ల దళారుల దోపిడీకి గురవుతున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రైతుల హక్కులను రక్షించేందుకు కనీస మద్దతు ధర చట్టాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిందని తెలిపారు. నిత్యావసర వస్తువులను అక్రమంగా నిల్వ ఉంచడం తీవ్రమైన నేరమని, ప్రజల ఆకలిని లాభంగా మార్చుకునే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రేషన్ వ్యవస్థలో గతంలో దొడ్డు బియ్యం పంపిణీ వల్ల పేదలకు ప్రయోజనం తక్కువగా ఉండటం, బ్లాక్ మార్కెట్ మాఫియా పెరగడం జరిగిందని గుర్తించి సన్నబియ్యం పథకాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా ప్రస్తుతం రాష్ట్రంలోని 86 శాతం ప్రజలు లబ్ధి పొందుతున్నారని, భవిష్యత్తులో ఇది 90 శాతానికి చేరే అవకాశముందని చెప్పారు. రైతులను సన్నవడ్లు పండించేందుకు క్వింటాకు రూ.500 బోనస్ అందిస్తున్నామని వెల్లడించారు. అడిగిన ప్రతి అర్హుడికి రేషన్ కార్డులు అందించామని, సన్నబియ్యం పంపిణీతో బ్లాక్ మార్కెట్ నియంత్రణలోకి వచ్చిందని తెలిపారు. పౌర సరఫరాల శాఖ నిరంతర పర్యవేక్షణతో ఈ విజయాన్ని సాధించగలిగామని చెప్పారు. భవిష్యత్తులో విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టిక ఆహారం అందించడం లక్ష్యంగా పనిచేస్తామని పేర్కొన్నారు. అలాగే పంట మార్పిడి విధానంపై రైతులకు అవగాహన కల్పిస్తామని, వాణిజ్య పంటలను ప్రోత్సహిస్తామని తెలిపారు. ఆహార కల్తీని అరికట్టేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసి కఠిన చట్టాలను అమలు చేస్తామని సీఎం వెల్లడించారు.



## దేశ వికాసంలో రాజస్థాన్ ప్రజల పాత్ర అపారమని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ప్రశంస

హైదరాబాద్, 31 మార్చి 2026: దేశ వికాసంలో రాజస్థాన్ ప్రజల పాత్ర ఎంతో ప్రత్యేకమైనది అని రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. సోమవారం లోక్ భవన్‌లో ఏక్ భారత్ – శ్రేష్ఠ భారత్ కార్యక్రమంలో, రాజస్థాన్ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో హైదరాబాద్‌లో నివసిస్తున్న రాజస్థాన్ వాసులు ఉత్సాహంగా పాల్గొన్నారు, రాష్ట్ర గవర్నర్ తన సతీమణితో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గవర్నర్ ప్రసంగంలో, దేశంలో సంస్కృతి, సాంప్రదాయాల పరంగా రాజస్థాన్ ప్రత్యేకత కలిగి ఉందని, భగవాన్ శ్రీరాముని తత్త్వాన్ని ఆశ్రయించి రాజస్థాన్ ప్రజలు దేశ అభివృద్ధి, సాంస్కృతిక వికాసంలో గొప్ప సేవలు అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో రాజస్థాన్ సాంస్కృతిక ప్రదర్శనలు ముఖ్య ఆకర్షణగా నిలిచాయి. అదనంగా, గవర్నర్ కార్యదర్శి శ్రీ శశికిరణాచారి, లోక్ భవన్ ఉన్నతాధికారులు, రాజస్థాన్ ప్రతినిధులు పాల్గొన్నారు.




## హైదరాబాద్‌లో మార్చ్ 31న ఫార్మసిస్ట్ / అసిస్టెంట్ పోస్టుల కోసం జాబ్ మేళా – 100 భర్తీ అవకాశాలు

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చ్ 31: ఉస్మానియా యూనివర్సిటీలోని ఎంప్లాయ్మెంట్ బ్యూరో / MCC ఆధ్వర్యంలో, మెడ్ ప్లస్ గ్రూప్ నిర్వహిస్తున్న ఫార్మసిస్టు మరియు అసిస్టెంట్ పోస్టుల కోసం 100 భర్తీ అవకాశాలతో జాబ్ మేళా ఈ నెల 31న ఉదయం 11 గంటలకు జరగనుంది. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా ఉన్న ఎంప్లాయ్మెంట్ బ్యూరో (UEIGB-MCC) కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించబడుతుంది. ఈ జాబ్ మేళాలో డీ ఫార్మసీ, బీ ఫార్మసీ, ఎం.ఫార్మసీ మరియు ఇతర సమాన డిగ్రీల యువకులు, యువతులు (వయసు 18–30) మాత్రమే హాజరు కావచ్చు. ఫార్మసిస్టు కోసం నెలకు ₹19,000, అసిస్టెంట్ ఫార్మసిస్టు కోసం ₹12,756 వేతనం అందుబాటులో ఉంటుందని UEIGB/MCC చీఫ్ శ్రీ టి. రాము వెల్లడించారు. మరిన్ని వివరాల కోసం శ్రీ సాయి శైలేష్, HR (Ph: 9666662481) ను సంప్రదించవచ్చని, హాజరు కావలసినవారు విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్‌తో నేరుగా 31 మార్చ్ 2026 న UEIGB-MCC కార్యాలయంలో హాజరుకావాలని సూచించారు.



## మార్పు కోసం ఓటు – యూడిఎఫ్‌తో కేరళలో భవిష్యత్తు సుస్థిరం: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కేరళ, 31 మార్చి 2026: తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈరోజు కేరళలో జరిగిన బహిరంగ సభలో ప్రజలను యూడిఎఫ్‌కి మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. అగ్రనేత రాహుల్ గాంధీ పాల్గొన్న ఆ సభలో మంత్రి మాట్లాడుతూ, పది సంవత్సరాల ఎల్‌డిఎఫ్ పాలన ప్రజలను నిరాశ పరిచిందని, అవినీతి, నిర్లక్ష్య పాలన కారణంగా యువతకు ఉద్యోగాలు లేకపోవడం, పెట్టుబడులు రాకపోవడం, సంక్షేమం కేవలం ప్రచార పరిమితమై ఉండటం వంటి సమస్యలున్నాయని హెచ్చరించారు.మంత్రి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, “కేరళ ప్రజల భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉంది. అభివృద్ధి, సంక్షేమం, పారదర్శక పాలన కోసం యూడిఎఫ్‌ను భారీ మెజార్టీతో గెలిపించండి. దేశవ్యాప్తంగా విభజన రాజకీయాలు చేస్తూ ప్రజల మధ్య విభేదాలు పెంచే బిజేపీకి కేరళలో స్థానం లేదు. నిజమైన ప్రత్యామ్నాయం యూడిఎఫ్ మాత్రమే,” అన్నారు.సభలో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, పారదర్శక పాలనను ఉదాహరణగా చూపిస్తూ, కేరళలో కూడా ప్రజా పాలన తీసుకురాగలిగేది కాంగ్రెస్ మాత్రమే అని మంత్రి స్పష్టం చేశారు.

## శాసన మండలిలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న గర్జన: బీసీ అట్రాసిటీ చట్టం మరియు గిగ్ వర్కర్ల రక్షణకై డిమాండ్



హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి, 31 మార్చి 2026: శాసన మండలి వేదికగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న బహుజన మరియు కార్మిక వర్గాల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ తరహాలోనే బీసీలపై జరుగుతున్న దాడులు, హత్యలు మరియు కుల వివక్షను అరికట్టడానికి తక్షణమే 'బీసీ అట్రాసిటీ చట్టం' తీసుకురావాలని ఆయన గట్టిగా డిమాండ్ చేశారు. కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేస్తూ బీసీలకు లక్ష కోట్లు కేటాయించడంతో పాటు వారి రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాల్సిన అవసరం ఉందని, నాగర్‌కర్నూల్ వంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని పేర్కొన్నారు. అలాగే గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్ల వెల్ఫేర్ బిల్లుపై చర్చిస్తూ, ఓలా, ఉబర్, జొమాటో వంటి సంస్థల్లో పనిచేసే డెలివరీ బాయ్స్ మరియు డ్రైవర్లు కనీస పని గంటలు లేకుండా 14 గంటల పాటు రోడ్లపై ప్రాణాలకు తెగించి శ్రమిస్తున్నారని, ప్రమాదాలు జరిగినప్పుడు 15 రోజుల్లోపు ఇన్సూరెన్స్ అందేలా చట్టంలో నిబంధనలు చేర్చాలని కోరారు. మహిళా గిగ్ వర్కర్ల భద్రత కోసం ఎస్ఓఎస్ (SOS) బటన్, లైవ్ ట్రాకింగ్ వంటి సదుపాయాలు కల్పించాలని, అలాగే దాదాపు 50 వేల కుటుంబాలు ఆధారపడి ఉన్న అవుట్‌డోర్ మీడియా రంగాన్ని కొందరి ప్రయోజనాల కోసం దెబ్బతీయవద్దని, చిన్న హోర్డింగ్ వ్యాపారులను రోడ్డు పాలు చేయకుండా ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఈ సందర్భంగా మల్లన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## దేశంలో తగ్గిన మావోయిస్టుల ప్రభావం: కేంద్ర హోంమంత్రి అమిత్ షా



హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి, 31 మార్చి 2026: కేంద్ర హోంమంత్రి అమిత్‌షా దేశంలో మావోయిస్టుల ప్రస్తుత పరిస్థితిపై కీలక గణాంకాలను వెల్లడించారు, గడిచిన మూడు సంవత్సరాల కాలంలో భద్రతా దళాల చర్యల వల్ల 706 మంది మావోయిస్టులు హతమయ్యారని, అదే సమయంలో సుమారు 4,800 మందికి పైగా మావోయిస్టులు హింసా మార్గాన్ని వీడి సాధారణ జీవితం గడపడానికి ప్రభుత్వం ముందు లొంగిపోయారని ఆయన పేర్కొన్నారు. ఒకప్పుడు దేశవ్యాప్తంగా విస్తరించి ఉన్న మావోయిస్టుల ప్రభావం ప్రస్తుతం కేవలం రెండు ప్రాంతాలకు మాత్రమే పరిమితమైందని హోంమంత్రి స్పష్టం చేశారు, మావోయిస్టుల పూర్తి నిర్మూలన ధ్యేయంగా కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత సమన్వయంతో కృషి చేస్తున్నాయని, ఈ వ్యూహాత్మక చర్యల వల్ల దేశంలో అంతర్గత భద్రత మరింత మెరుగుపడిందని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు.

## కాకతీయ యూనివర్సిటీ హాస్టల్లో ఎలుకల స్వైరవిహారం: 14 మంది విద్యార్థులకు గాయాలు



హన్మకొండ, సందేశం టైమ్స్ ప్రతినిధి, 31 మార్చి 2026: హన్మకొండ జిల్లా కేంద్రంలోని కాకతీయ యూనివర్సిటీ (కేయూ) హాస్టల్ ఆవరణలోని సమ్మక్క సారక్క హాస్టల్‌లో ఎలుకలు ఒక్కసారిగా కలకలం సృష్టించాయి, అర్ధరాత్రి వేళ నిద్రిస్తున్న సుమారు 14 మంది విద్యార్థులను ఎలుకలు కరవడంతో వారు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. గాయపడిన విద్యార్థులు వెంటనే చికిత్స నిమిత్తం యూనివర్సిటీ హెల్త్ సెంటర్‌కు వెళ్లగా, అక్కడ కనీస మందులు అందుబాటులో లేవని సిబ్బంది సమాధానం చెప్పడంతో చేసేదేమీ లేక విద్యార్థులు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వచ్చింది. హాస్టల్ నిర్వహణ సరిగా లేదని, ఎలుకల బెడదపై గతంలోనే అధికారులకు మరియు సంబంధిత సిబ్బందికి పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ వారు ఏమాత్రం పట్టించుకోలేదని, అధికారుల నిర్లక్ష్యం వల్లే తమకు ఈ పరిస్థితి దాపురించిందని విద్యార్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకోవాలి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



సందేశం టైమ్స్, సూర్యాపేట, మార్చి 31, ప్రతినిధి: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా సత్వరమే పరిష్కరించాలని, నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ హెచ్చరించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల వద్ద నుంచి మొత్తం 78 దరఖాస్తులను స్వీకరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. రాష్ట్ర స్థాయి గ్రీవెన్స్‌లకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రతి దరఖాస్తును సమయానికి పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో భూ సమస్యలకు సంబంధించి 33 దరఖాస్తులు, డీఆర్‌డీఏకు 6, డీపీవోకు 5, డీడబ్ల్యూవోకు 5, మిగిలిన 29 వివిధ శాఖలకు చెందినవిగా మొత్తం 78 దరఖాస్తులు వచ్చినట్లు వెల్లడించారు. వాటిని సంబంధిత శాఖలకు పంపించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి అదనపు కలెక్టర్ కే సీతారామా రావు, జిల్లా పరిషత్ సీఈఓ శిరీష, రెవెన్యూ డివిజన్ అధికారి వేణు మాధవరావు తదితర జిల్లా అధికారులు హాజరయ్యారు

# మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు సబ్‌కోటా తప్పనిసరి బీసీ సంఘాల డిమాండ్



సందేశం టైమ్స్, మునగాల, మార్చి 31, ప్రతినిధి: పార్లమెంటులో ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు ప్రత్యేక సబ్‌కోటా తప్పనిసరిగా కల్పించాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల సైదులు ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఇప్పటివరకు పాలన వ్యవస్థలో వెనుకబడిన వర్గాల మహిళలకు సరైన ప్రాతినిధ్యం దక్కకపోవడం ఆందోళనకరమని పేర్కొన్నారు. దేశ జనాభాలో మహిళలు గణనీయ శాతం ఉన్నప్పటికీ రాజకీయ రంగంలో వారి ప్రాతినిధ్యం తక్కువగా ఉండటం దురదృష్టకరమని, ముఖ్యంగా బీసీ మహిళలు సామాజిక-ఆర్థిక రంగాల్లో ఇంకా వెనుకబడి ఉన్న నేపథ్యంలో వారికి ప్రత్యేక అవకాశాలు కల్పించకపోతే నిజమైన సమానత్వం సాధ్యంకాదని అన్నారు. ఇప్పటి వరకు కొద్ది వర్గాలకే అధికారాలు కేంద్రీకృతమయ్యాయని, భవిష్యత్తులో అన్ని వర్గాల మహిళలకు సమాన హక్కులు, అవకాశాలు లభించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. బీసీ మహిళలకు ప్రత్యేక సబ్‌కోటా కల్పించడం ద్వారానే సామాజిక న్యాయం ప్రతిష్ఠించబడుతుందని స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లులో కేంద్ర ప్రభుత్వం తక్షణ సవరణలు చేసి బీసీ మహిళలకు ప్రత్యేక కోటా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ, విఫలమైతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.



# బొమ్మరెడ్డి గూడెంలో చలివేంద్రం ప్రారంభం పారిశుద్ధ్య సిబ్బందికి కిట్ల పంపిణీ

సందేశం టైమ్స్, చౌటకూర్ మండలం, మార్చి 31, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం బొమ్మరెడ్డి గూడెం గ్రామంలో గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో సోమవారం చలివేంద్రాన్ని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేశారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పారిశుద్ధ్య సిబ్బందికి అవసరమైన కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జైపాల్ నాయక్, ఉపసర్పంచ్ రజిని గోపాల్, కార్యదర్శి నరేష్, అంగన్వాడీ టీచర్ గీత, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు నాగరాజు, మాజీ ఎంపిటీసీ సుదర్శన్, రఘునాయక్, పోసాని పేట ఉపసర్పంచ్ రమేష్, రాజు కుమార్, అరుణ్ నాయక్, సర్వన్ నాయక్, రాజు, వసంత్, సురేష్, సంగ్య తదితరులు పాల్గొన్నారు.



# సంగారెడ్డిలో "ప్రజావాణి" - ఫిర్యాదుదారులతో ఎస్పీ ప్రత్యక్షంగా మాట్లాడి తక్షణ చర్యల ఆదేశాలు

సంగారెడ్డి, సందేశం టైమ్స్ ప్రతినిధి మార్చి 31 సంగారెడ్డి జిల్లా లో ప్రజల సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలనే లక్ష్యంతో జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న "ప్రజావాణి" కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపీఎస్ ఫిర్యాదుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వచ్చిన ఫిర్యాదులను శ్రద్ధగా విని, సంబంధిత పోలీస్ స్టేషన్‌ల ఎస్.హెచ్.ఓలతో ఫోన్ ద్వారా మాట్లాడి వివరాలు తెలుసుకుని, ప్రతి కేసును నిష్పక్షపాతంగా విచారణ చేసి బాధితులకు న్యాయం జరిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లలో సమస్యలు పరిష్కారం కాకపోతే ఎలాంటి భయం లేకుండా, మధ్యవర్తుల అవసరం లేకుండా జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగే "ప్రజావాణి" కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని జిల్లా ప్రజలకు ఎస్పీ సూచించారు.

# గీతం యూనివర్సిటీలో సైబర్ అవగాహన వర్క్‌షాప్ విద్యార్థులకు కీలక సూచనలు





సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 31, ప్రతినిధి: తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో గీతం డీమ్డ్ టు బి యూనివర్సిటీ సంగారెడ్డి క్యాంపస్‌లోని కిన్నెర హాల్‌లో "స్టూడెంట్ ప్రోగ్రామ్ ఫర్ అవగాహన మరియు బాధ్యతాయుత సైబర్ వినియోగం" కార్యక్రమం భాగంగా సైబర్ అవగాహన, సెన్సిటైజేషన్ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. డైరెక్టర్ శిఖా గోయల్ ఐపిఎస్ ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎస్పీ ఎస్.వి. హరికృష్ణ మాట్లాడుతూ పెరుగుతున్న సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరాన్ని వివరించి, అనుమానాస్పద కార్యకలాపాలను వెంటనే నివేదించాలని సూచించారు. డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి యుపిఐ మోసాలు, ఓటిపి మోసాలు, సోషల్ మీడియా హ్యాకింగ్ అంశాలపై అవగాహన కల్పించగా, శాలిని రాథోర్ యువతలో డిజిటల్ బాధ్యత, సైబర్ హైజీన్‌పై దృష్టి సారించారు. రష్మి శ్రీవాస్తవ మహిళలు, విద్యార్థులు ఎదుర్కొనే సైబర్ వేధింపుల అంశాలను వివరించగా, శిఖర్ ద్వివేది సైబర్ భద్రతా సాధనాలు, పాస్‌వర్డ్ రక్షణ, రెండు దశల ధృవీకరణపై ప్రాక్టికల్ మార్గదర్శనం అందించారు. సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో సైబర్ మోసాలు, ఫిషింగ్ దాడులు, డేటా గోప్యత, సైబర్ చట్టాలపై సమగ్ర అవగాహన కల్పిస్తూ సురక్షిత డిజిటల్ వాతావరణ నిర్మాణంలో ప్రతి ఒక్కరి బాధ్యతను గుర్తుచేశారు.

# జోగిపేటలో విద్యుత్ కార్మికుల సమ్మె సైరన్ - సమస్యల పరిష్కారం కోసం ధర్నా



సందేశం టైమ్స్, అందోల్ మండలం, మార్చి 31, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గం జోగిపేటలో విద్యుత్ సంస్థల కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సమ్మె సైరన్ మోగిస్తూ జోగిపేట డివిజన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు ఆర్టిజన్ ఉద్యోగులకు ఏపీఎస్సీబీ నిబంధనలు వర్తింపజేయాలని, సమాన పనికి సమాన వేతనం కల్పించాలని, విద్యార్హతల ఆధారంగా కన్వర్షన్ చేయాలని, మీటర్ రీడింగ్, పోల్ టు పోల్, ఎఫ్‌ఓసీ వర్కర్లను విద్యుత్ సంస్థల్లో విలీనం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్పీడీసీఎల్ చైర్మన్ వెంకట్ నాయక్, యూనియన్ నాయకులు లక్ష్మయ్య, మొగులయ్య, బాలరాజ్, కృష్ణ దేవరాయలు, మల్లేశం, ట్రాన్స్‌కో భాను ప్రకాష్ తదితరులు కార్మికులకు మద్దతు తెలుపుతూ 24 గంటలు సేవలందిస్తున్న విద్యుత్ కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీవీజేఏసీ నాయకులు రంజిత్, జోగినాథ్, రాజేందర్, డి. సాయిలు, పవన్, నాగరాజు, మల్లేశం, సుధాకర్, హరికృష్ణ, సురేష్, వసీం, ముక్తార్ పాషా తదితరులు పాల్గొన్నారు.



# సంగారెడ్డిలో సబ్-డివిజినల్ పోలీసు కార్యాలయ నూతన భవనం ప్రారంభం

సంగారెడ్డి, సందేశం టైమ్స్ ప్రతినిధి మార్చి 31 సంగారెడ్డి జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ సమీపంలో నిర్మించిన ఉపవిభాగ పోలీసు కార్యాలయ నూతన భవనాన్ని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్ సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మరింత సమర్థవంతమైన, వేగవంతమైన పోలీసు సేవలు అందించడమే లక్ష్యంగా ఆధునిక సదుపాయాలతో ఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగిస్తూ ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తున్నామని, ఎలాంటి సమస్యలు ఉన్నా ప్రజలు నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి డిఎస్పీ సత్యయ్య గౌడ్, డీసీఆర్బీ డిఎస్పీ సురేందర్ రెడ్డి, ఎఆర్ డిఎస్పీ నరేందర్, ఇన్స్పెక్టర్లు రమేష్, రాము నాయుడు, రామకృష్ణ రెడ్డి, కిరణ్ కుమార్, సదా నాగరాజు, ప్రవీణ్ రెడ్డి, నాగేశ్వర్ రావు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# సంగారెడ్డిలో ఘనంగా మొబైల్ రికవరీ మేళా 219 ఫోన్లు యజమానులకు పునఃప్రదానం




సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 31, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లాలో సెల్ ఫోన్ పోగొట్టుకున్న వారు సి.ఇ.ఐ.ఆర్ పోర్టల్‌లో వెంటనే ఫిర్యాదు నమోదు చేయాలని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపీఎస్ సూచించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన "మొబైల్ రికవరీ మేళా"లో గత నెల రోజులుగా ఐటీ సెల్, సైబర్ సెల్, ఎస్-న్యాబ్ ప్రత్యేక బృందాల కృషితో రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి రికవరీ చేసిన మొత్తం 219 మొబైల్ ఫోన్లను బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మొబైల్ ఫోన్లలో వ్యక్తిగత, ఆర్థిక సమాచారం ఉండటంతో దొంగిలింపులకు గురైతే భారీ నష్టం జరిగే అవకాశముందని, సైబర్ నేరగాళ్లు వీక్ పాస్‌వర్డ్స్ ద్వారా డబ్బులు దోచుకునే ఘటనలు పెరుగుతున్నాయని తెలిపారు. కాబట్టి ఫోన్ పోగొట్టుకున్న వెంటనే సి.ఇ.ఐ.ఆర్ పోర్టల్‌లో బ్లాక్ చేసి, పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సెకండ్ హ్యాండ్ మొబైల్ కొనుగోలు చేసే వారు తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని, దొంగ ఫోన్ల కొనుగోలు చేస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మొబైల్ రికవరీలో కీలకంగా పనిచేసిన ఐటీ సెల్ ఇన్స్పెక్టర్ సదా నాగరాజు, సిబ్బంది భవానీ, ఇర్ఫాన్ అలీ, హరికృష్ణ, స్నేహిత, రాజలింగం, సంతోష్, మమత, రవి, సంజీవ్, ఉదయ్, అన్నపూర్ణ, భారతి, విజయ్ తదితరులను ఎస్పీ అభినందించారు.



## నాగులవంచలో నూతన డయాగ్నస్టిక్ సెంటర్ ప్రారంభం


సందేశం టైమ్స్, నాగులవంచ, మార్చి 31, ప్రతినిధి: పల్లెల్లో వ్యాధి నిర్ధారణ పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయడం హర్షణీయమని నాగులవంచ గ్రామ సర్పంచ్ నారగాని రాంబాయి అన్నారు. సోమవారం నాగులవంచలో నూతనంగా ఏర్పాటు చేసిన రమణ డయాగ్నస్టిక్ సెంటర్‌ను ఆమె ప్రారంభించారు. పరీక్షల్లో కచ్చితత్వం ఎంతో ముఖ్యమని పేర్కొంటూ నిర్వాహకులు గడ్డం విజయ్‌కు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో నాగులవంచ శ్రీ గజగిరి లక్ష్మీనరసింహస్వామి మరియు శ్రీ కోదండరామ స్వామి దేవస్థాన కమిటీ చైర్మన్ ముత్తినేని వెంకటేశ్వర్లు, డాక్టర్ కూరపాటి తులసీరాం, రిటైర్డ్ గెజిటెడ్ హెచ్‌ఎం అంబటి శాంతయ్య, జర్నలిస్టులు జొన్నలగడ్డ మల్లీశ్వరి, చావ అరుణ్ కుమార్, గుడిద పిచ్చయ్య, గండారపు రామారావు, గ్రామ పెద్దలు మునుకుంట్ల సుబ్బారావు, ఆలశ్యం రవి, ఆలస్యం బసవయ్య, సిలివేరు సైదులు, కూరపాటి మురళి, రౌతు అప్పారావు, కందరబోయిన కొండలరావు, మైలవరపు లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## అపహరణకు గురైన పాము శిలవ రాజును పరామర్శించిన లింగాల కమల్ రాజు



సందేశం టైమ్స్, ముదిగొండ, మార్చి 31, ప్రతినిధి: ఇటీవల కొంతమంది దుండగుల చేత అపహరణకు గురైన పండ్రేగుపల్లి గ్రామ మాజీ సర్పంచ్, ప్రస్తుత సర్పంచ్ స్వర్ణలత భర్త పాము శిలవ రాజును జడ్పీ మాజీ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి లింగాల కమల్ రాజు పరామర్శించారు. గ్రామంలో వ్యక్తిగత భూమి తగాదాలను కారణంగా చేసుకొని బిఆర్ఎస్ నాయకుడిని హతమార్చేందుకు కుట్ర పన్నడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. అసాంఘిక శక్తులపై ప్రజలు, పార్టీ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వాచేపల్లి లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీ సామినేని హరిసాద్స్, మండల కార్యదర్శి గడ్డం వెంకటేశ్వర్లు, నాయకులు బంక మల్లయ్య, పచ్చ సీతారామయ్య, మాజీ సర్పంచ్ అమరయ్య, బండ్ల వాసు, కిరణ్, బిక్షం, శంకర్, నాగార్జున, లింగస్వామి, వీరయ్య, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాణాపాయ స్థితిలో వృద్ధురాలికి ప్రాణదానం – స్వర్ణభారతి ట్రస్ట్ ద్వారా 1125వ రక్తదానం



సందేశం టైమ్స్, కోదాడ, మార్చి 31, ప్రతినిధి: కోదాడ గాయత్రి హాస్పిటల్‌లో ప్రాణాపాయ స్థితిలో ఉన్న 70 ఏళ్ల వజ్రపు సక్కుభాయికి స్వర్ణభారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అత్యవసరంగా రక్తం అందించి ప్రాణాలను కాపాడారు. ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి శ్రీమతి చారుగుండ్ల ప్రవీణను సంప్రదించగా ఎస్వీ విద్యాసంస్థల ప్రిన్సిపాల్ వెంటనే స్పందించి తిరుమల అథరైజ్డ్ బ్లడ్ బ్యాంక్ ద్వారా ఓ పాజిటివ్ రక్తాన్ని సమకూర్చారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షులు నీలా సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఓరుగంటి కిట్టు, సభ్యులు వంగవేటి రంగారావు, చీదేళ్ల హనుమంతరావు, నాగుబండి పురుషోత్తం తదితరులు రక్తదాత గద్దె రఘును అభినందించారు. స్వర్ణభారతి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఇది 1125వ రక్తదానంగా నిలిచింది.

## సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ – హస్నాబాద్ సర్పంచ్ చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేత



సందేశం టైమ్స్, రాయికోడ్ మండలం, మార్చి 31, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం హస్నాబాద్ గ్రామానికి చెందిన చాకలి మల్లేశంకు రూ.15,000, పిచ్యరగటి సంధ్యకు రూ.10,000 ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఉమ్మడి మెదక్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి సహకారంతో గ్రామ సర్పంచ్ తులసి–హన్మంతు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ భారతమ్మ, వార్డు సభ్యులు ఎలవంటి మణెమ్మ, మ్యాదరి శామామ్మ, క్యాసారం సత్యమ్మ, చాకలి బిచ్చయ్య, లింగమొల్ల మోహన్, పిచ్యరగటి నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు – పేదలకు గృహ కల సాకారం



సందేశం టైమ్స్, అందోల్ టౌన్, మార్చి 31, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గం అల్లదుర్గ్ మండలంలోని సితనగర్ తండా గ్రామంలో పల్త్యా సంగ్యా నాయక్, బులిబాయి గారి ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ వేడుకలు ఘనంగా నిర్వహించగా ముఖ్య అతిథిగా అల్లదుర్గ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొప్పుల శేషారెడ్డి పాల్గొని ప్రారంభోత్సవం చేశారు. మంత్రివర్యులు దామోదర్ రాజనర్సింహ ఆధ్వర్యంలో ప్రతి పేదవానికి సొంత ఇంటి కల నెరవేర్చే లక్ష్యంతో "ఇందిరమ్మ ఇళ్లు" పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందని, అర్హులైన వారికి సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి కుటుంబానికి ఆత్మగౌరవంతో కూడిన నివాసం కల్పించడమే ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతి కార్యదర్శి అనిత, సోషల్ మీడియా కోఆర్డినేటర్ జైపాల్, గ్రామ పార్టీ అధ్యక్షుడు బెతయ్య, హనుమయ్య, శ్రీకాంత్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సెన్సస్ 2027 సన్నాహకాలపై వీడియో కాన్ఫరెన్స్ – సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు





సందేశం టైమ్స్, సూర్యాపేట, మార్చి 31, ప్రతినిధి: దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సెన్సస్ 2027 కార్యక్రమం సన్నాహకాలకు సంబంధించి డైరెక్టర్ భారతి హోళికేరి సోమవారం హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సెన్సస్ ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేయడానికి అవసరమైన మార్గదర్శకాలు, ప్రణాళికలు, సాంకేతిక అంశాలపై సమగ్రంగా వివరించారు. జిల్లా స్థాయిలో చేపట్టాల్సిన ముందస్తు ఏర్పాట్లు, సిబ్బంది శిక్షణ, డేటా సేకరణ విధానాలపై కలెక్టర్లకు సూచనలు అందిస్తూ, సెన్సస్ ప్రక్రియను సమయానికి పూర్తి చేయడానికి అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ముఖ్య ప్రణాళిక అధికారి కిషన్ పాల్గొన్నారు.

## మున్సిపల్ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలి కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**పరిశుభ్రత, మౌలిక సదుపాయాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి – 99 రోజుల కార్యక్రమం సమర్థవంతంగా అమలు చేయాలి**





సందేశం టైమ్స్, సూర్యాపేట, మార్చి 31, ప్రతినిధి: మున్సిపల్ అభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు. సోమవారం సూర్యాపేట పట్టణంలోని రవి మహల్ కన్వెన్షన్ హాల్‌లో మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, చైర్‌పర్సన్ నివేదిత, వైస్ చైర్‌పర్సన్ షఫీ ఉల్లా లతో కలిసి మున్సిపల్ బడ్జెట్ సమావేశానికి హాజరై మాట్లాడారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం స్థానిక సంస్థల అభివృద్ధికి బడ్జెట్ ప్రణాళికలను సమర్థవంతంగా రూపొందించి అమలు చేయాలని తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పన, పారిశుద్ధ్య నిర్వహణ, త్రాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ వంటి అంశాలపై సమీక్ష నిర్వహిస్తూ మొదటిసారిగా నిర్వహిస్తున్న బడ్జెట్ సమావేశానికి హాజరైన కౌన్సిల్ సభ్యులను అభినందించారు. ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యక్రమాన్ని మున్సిపాలిటీల్లో సమర్థవంతంగా అమలు చేయాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు మున్సిపల్ సిబ్బంది కృషి చేయాలని, ప్రజా ప్రతినిధులు వార్డుల్లో పర్యటిస్తూ చెత్త తొలగింపు, డ్రైనేజీల శుభ్రపరచడం, రోడ్ల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కోదాడ నియోజకవర్గంలో మత్స్యకారులపై దాడులు – చెరువుల లూటీలపై ఆగ్రహం





సందేశం టైమ్స్, కోదాడ నియోజకవర్గం, మార్చి 31, ప్రతినిధి: సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గంలో మత్స్యకారులపై పథకం ప్రకారం దాడులు, చెరువుల లూటీలు జరుగుతున్నాయని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మత్స్యశాఖ అధికారులు, పోలీసులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ ఇటీవలి కాలంలో మత్స్యకారులపై దాడులు పెరిగాయని తెలిపారు. గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో కొంతమంది ప్రభావశీలులు మత్స్య సహకార సంఘాలపై ఒత్తిడి తీసుకువస్తున్నారని, చెరువులపై ఆధారపడి జీవిస్తున్న వారి జీవనోపాధిని దెబ్బతీయాలని ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. మోతె మండలం తుమ్మలపల్లి మత్స్య సహకార సంఘం 1989లో ఏర్పడి ఇప్పటివరకు సభ్యులు చేపల వృత్తితో జీవిస్తున్నారని, ఇటీవల చెరువుల్లో వదిలిన చేప పిల్లలను పెరిగిన తర్వాత అక్రమంగా లూటీ చేసిన ఘటనలో సుమారు రూ.2 లక్షల నష్టం జరిగిందని తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ కాలయాపన జరిగిందని, దీనివల్ల చెరువుల లూటీలు కొనసాగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన మత్స్యకారులు, చెరువులను లూటీ చేసిన వారిపై వెంటనే దొంగతనం కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే నియోజకవర్గ స్థాయిలో భారీ ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

# హ్యాండ్లూమ్ డిప్లొమా కోర్సుకు అడ్మిషన్లు ప్రారంభం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి

సందేశం టైమ్స్, సూర్యాపేట, మార్చి 31, ప్రతినిధి: కొండా లక్ష్మణ్ బాపూజీ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ హైదరాబాద్‌లో 2026–27 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమైనట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్ టెక్నాలజీలో మూడేళ్ల డిప్లొమా కోర్సు ఉండగా మొత్తం 6 సెమిస్టర్లు, 60 సీట్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. 10వ తరగతి లేదా తత్సమాన పరీక్షలో ఇంగ్లీష్ సబ్జెక్టుతో ఉత్తీర్ణులైన వారు అర్హులని, ప్రవేశాలు పూర్తిగా 10వ తరగతి మార్కుల మెరిట్ ఆధారంగా జరుగుతాయని తెలిపారు. 10+2 (ఎంపీసీ) పూర్తి చేసిన వారు నేరుగా రెండో సంవత్సరంలో చేరవచ్చని, గరిష్ట వయస్సు 23 సంవత్సరాలు కాగా ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 25 సంవత్సరాల వరకు సడలింపు ఉంటుందని పేర్కొన్నారు. ఎంపికైన ప్రతి విద్యార్థికి నెలకు రూ.2,500 స్టైపెండ్ తెలంగాణ ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. పూర్తి వివరాల కోసం klbiiht.telangana.gov.in వెబ్‌సైట్, iihthyderabad@gmail.com ఈమెయిల్, 040-29367009 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

# డప్పూర్‌లో ఉర్సు షరీఫ్ మహోత్సవం ఘనంగా – సందల్ ఊరేగింపులు, ఖవ్వాలి కార్యక్రమాలతో భక్తుల సందడి



సందేశం టైమ్స్, న్యాలకల్ మండలం, మార్చి 31, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా న్యాలకల్ మండలం డప్పూర్ గ్రామంలో జరుగుతున్న 186వ ఉర్సు షరీఫ్ మహోత్సవం ఘనంగా కొనసాగుతూ భక్తులను ఆకట్టుకుంటోంది. ఉర్సు సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొని పరిసర ప్రాంతాల నుండి భక్తులు భారీగా తరలివస్తున్నారు. మార్చి 30న ఖురేషీ సందల్ ఊరేగింపుతో పాటు రాత్రి ఖవ్వాలి కార్యక్రమం నిర్వహించగా ప్రముఖ గాయకులు అర్మాన్ ఎఫ్తేకార్ (నాందేడ్), రేష్మా తాజ్ (లక్నో) పాల్గొని భక్తులను అలరించారు. దర్గాలో చాదర్ సమర్పణ, ప్రత్యేక ప్రార్థనల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ ఉత్సవాలకు డప్పూర్, రత్నాపూర్, మల్గి, సుల్తాన్‌పూర్, వడ్డి, శంషాలాపూర్, అత్నూర్, న్యాలకల్, చింగేపల్లి, షాపూర్ గేట్, కాష్లాపూర్ గ్రామాల నుండి భక్తులు విచ్చేశారు. మార్చి 31న ఉదయం ఖుస్తీ పోటీలు నిర్వహించనుండగా విజేతలకు 5 గ్రాముల వెండి ఖడ బహుమతిగా అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ వేడుకలు విట్టల్ గౌడ్, అరుణ్ గౌడ్, మహమ్మద్ ఖాజా మియా, షేక్ ఐజాజ్, మహమ్మద్ గౌసుద్దీన్, మహమ్మద్ షకీల్, మహమ్మద్ అహ్మద్, మహమ్మద్ నబీ తదితరుల ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి.

# అల్లాదుర్గం కేంద్రంగా కొత్త అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పాటు చేయాలని ప్రధాని కార్యాలయానికి వినతి



సందేశం టైమ్స్, అల్లాదుర్గం, మార్చి 31, ప్రతినిధి: మెదక్ జిల్లాలో అల్లాదుర్గం కేంద్రంగా కొత్త శాసనసభ నియోజకవర్గం ఏర్పాటు చేయాలని కోరుతూ అల్లాదుర్గం అసెంబ్లీ సాధన సంఘం అధ్యక్షులు కంచరి బ్రహ్మం న్యూఢిల్లీలోని ప్రధానమంత్రి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాల పునర్విభజనలో అల్లాదుర్గం సబ్ డివిజన్ కేంద్రంగా ఏర్పడడంతో ప్రజలకు పరిపాలన పరంగా మెరుగైన సేవలు అందుతున్నాయని తెలిపారు. కాకతీయుల కాలం నాటి చారిత్రక ప్రాధాన్యత కలిగిన ఈ ప్రాంతం శిల్పకళ వైభవానికి ప్రతీకగా నిలిచిందని, రేణుక ఎల్లమ్మ దేవాలయం, వీరభద్ర స్వామి ఆలయం, బేతాళ స్వామి ఆలయాలు వంటి పుణ్యక్షేత్రాలు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చాయని పేర్కొన్నారు. నేషనల్ హైవే 161 సమీపంలో ఉండటం వల్ల రవాణా సౌకర్యాలు మెరుగ్గా ఉన్నాయని, 379 సర్వే నంబరులో ప్రభుత్వ భూమి విస్తారంగా ఉండటం అభివృద్ధికి అనుకూలమని తెలిపారు. అల్లాదుర్గంలో జూనియర్ సివిల్ కోర్ట్, సీఐ కార్యాలయం, పంచాయతీ రాజ్, నీటిపారుదల, ఐసిడిఎస్, ప్రభుత్వ కళాశాలలు, గురుకుల పాఠశాలలు కొనసాగుతున్నాయని, భౌగోళికంగా సమీప మండలాలకు మధ్యలో ఉండటం వల్ల పరిపాలనకు అనువైన కేంద్రంగా ఉందన్నారు. 2017 నుంచి 2024 వరకు ప్రధానమంత్రి కార్యాలయం, భారత ఎన్నికల కమిషన్‌కు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినట్లు తెలిపారు. టేక్మాల్, రేగోడు, పెద్ద శంకరంపేట మండలాలను కలుపుకుని అల్లాదుర్గం కేంద్రంగా నూతన అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పాటు చేయాలని, అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరించాలని వినతిలో కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు బసవరాజ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# మామిడ్డిలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు పనుల ప్రారంభం



సందేశం టైమ్స్, న్యాల్కల్ మండలం, మార్చి 31, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా న్యాల్కల్ మండలంలోని మామిడ్డి గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద రూ.10 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం సర్పంచ్ సవిత జగన్నాథ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ఇలాంటి మౌలిక వసతుల పనులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గ్రామంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దంత వైద్యుడు రాజేశ్వర్ రెడ్డి, జగన్నాథ్, సంజీవరెడ్డి, తుక్కారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గొర్రెకల్ గ్రామంలో రూ.5 లక్షల సీసీ రోడ్డు ప్రారంభం అభివృద్ధే లక్ష్యం: సర్పంచ్



సందేశం టైమ్స్, వట్పల్లి మండలం, మార్చి 31, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలంలోని గొర్రెకల్ గ్రామంలో సర్పంచ్ తిరుపతి లింగారెడ్డి ఆధ్వర్యంలో రూ.5 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ మౌలిక వసతుల అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ రోడ్డు ద్వారా గ్రామ ప్రజలకు రాకపోకలు సులభతరం అవుతాయని, భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని అన్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# అలీన ఎలక్ట్రికల్స్ హోమ్ అప్ లైన్స్ ప్రారంభించిన TGIDC మాజీ చైర్మన్ మొహమ్మద్ తన్వీర్ గారు




సందేశం టైమ్స్, జహీరాబాద్, మార్చి 31, ప్రతినిధి: జహీరాబాద్ పట్టణ పరిధిలో సంఘమిత్ర స్కూల్ ఎదురుగా అల్గోల్ రోడ్డులో అలీన్ ఎలక్ట్రికల్స్ హోమ్ అప్లయన్స్ షోరూమ్‌ను తెలంగాణ రాష్ట్ర ఇండస్ట్రియల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మొహమ్మద్ తన్వీర్ రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. మాజీ కౌన్సిలర్ ఫక్రుద్దీన్ కుమారుడు మొహమ్మద్ సమీ ఆహ్వానం మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన యజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జహీరాబాద్ మున్సిపల్ చైర్మన్ మొహమ్మద్ యూనుస్, కౌన్సిలర్లు జాంగిర్, మొహమ్మద్ అక్రమ్, మాజీ కౌన్సిలర్ మూతిరం షాకీర్, వస్తాద్ మొహమ్మద్ బాసిత్, మొహమ్మద్ మోయిన్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్లపై చెత్త పారబోస్తూ నిర్లక్ష్యం – ప్రజలు, ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు



సందేశం టైమ్స్, పటాన్చేరు, మార్చి 31, ప్రతినిధి: పటాన్చేరు మండలం ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలోని పెద్దవాగు పక్కన విచ్చలవిడిగా చెత్త పారబోసడం వల్ల తీవ్ర దుర్వాసన వ్యాపించి ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా చికెన్, మటన్ దుకాణాల వ్యర్థాలు అయిన కోడి ప్రేగులు, తోళ్లు నిర్లక్ష్యంగా పడవేయడం వల్ల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ప్లాస్టిక్ వ్యర్థాలను కూడా పారబోసడంతో ఆవులు వాటిని తిని అనారోగ్యానికి గురవుతున్నాయని, అలాగే మాంస అవశేషాలు తిన్న కుక్కలు వాహనదారులపై దాడులకు పాల్పడుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై మున్సిపల్ అధికారులు స్పందించకపోవడం పట్ల కాలనీవాసులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# ఇండ్ల స్థలాల దరఖాస్తు గడువు పొడిగించాలి: కౌన్సిలర్ పట్లూరి శివశేఖర్ విజ్ఞప్తి



సందేశం టైమ్స్, జోగిపేట, మార్చి 31, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా అందోల్ మండలంలో ఇండ్ల స్థలాల కోసం దరఖాస్తుల గడువును పొడిగించాలని 13వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ పట్లూరి శివశేఖర్ అందోల్ తహసీల్దార్‌ను కోరారు. ఈ నెల 20 నుంచి 31 వరకు మాత్రమే గడువు నిర్ణయించగా ఉగాది, శ్రీరామనవమి, జోగినాథ స్వామి జాతరల కారణంగా ప్రజలు వేడుకల్లో నిమగ్నమై ఉండటంతో పాటు అవసరమైన ధ్రువపత్రాల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని తెలిపారు. పది రోజుల గడువు సరిపోదని, అర్హులైన నిరుపేదలు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించేందుకు కనీసం మరో 20 రోజులు గడువు పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం నెలరోజుల గడువు ఇచ్చి పారదర్శకంగా నిర్వహించినట్లు గుర్తుచేసి, ప్రస్తుత ఇళ్ల స్థలాల మంజూరు ప్రక్రియను కూడా పారదర్శకంగా కొనసాగించాలని కోరారు.




# అసెంబ్లీలో హేట్ స్పీచ్ బిల్లు – ద్వేష ప్రసంగాలకు కఠిన శిక్షలు, సోషల్ మీడియా పోస్టులకూ వర్తింపు

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 31, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో "హేట్ స్పీచ్ & హేట్ క్రైమ్స్ (నిరోధక) బిల్లు–2026"ను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ బిల్లు ప్రకారం మతం, కులం, జాతి, లింగం తదితర అంశాలపై ద్వేషాన్ని రెచ్చగొట్టే ప్రసంగాలు, వ్యాఖ్యలు, పోస్టులు చేసిన వారికి కఠిన శిక్షలు విధించనున్నట్లు వెల్లడించింది. ముఖ్యంగా సోషల్ మీడియా వేదికలపై చేసే ద్వేషపూరిత వ్యాఖ్యలు కూడా ఈ చట్ట పరిధిలోకి వస్తాయని స్పష్టం చేసింది. మొదటిసారి తప్పు చేసిన వారికి 1 నుంచి 7 సంవత్సరాల వరకు జైలు శిక్షతో పాటు రూ.50 వేల జరిమానా, పునరావృతం చేస్తే 10 సంవత్సరాల వరకు జైలు శిక్షతో పాటు రూ.1 లక్ష జరిమానా విధించే నిబంధనలు ప్రతిపాదించారు. ఈ కేసులను నాన్-బెయిలబుల్‌గా పరిగణించే అవకాశముందని అధికారులు తెలిపారు. సామాజిక సామరస్యాన్ని కాపాడటం, విద్వేష ప్రచారాన్ని అరికట్టడం లక్ష్యంగా ఈ బిల్లును తీసుకొచ్చినట్లు ప్రభుత్వం పేర్కొంది.

# ఐపీఎల్ క్రికెట్ మహాసమరం ప్రారంభం – అభిమానుల్లో ఉత్సాహం వెల్లువ

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 31, ప్రతినిధి: భారతదేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన ట్వెంటీ-20 క్రికెట్ టోర్నమెంట్ అయిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) మరోసారి క్రీడాభిమానులను అలరిస్తోంది. 2008లో ప్రారంభమైన ఈ లీగ్ ప్రపంచంలోనే అత్యంత విలువైన క్రికెట్ టోర్నమెంట్‌గా గుర్తింపు పొందింది. దేశీయ, అంతర్జాతీయ ప్రముఖ ఆటగాళ్లు పాల్గొంటూ ప్రతి మ్యాచ్‌ను ఉత్కంఠభరితంగా మార్చుతున్నారు. ప్రతి జట్టు 20 ఓవర్ల ఫార్మాట్‌లో పోటీ పడుతూ లీగ్ దశ తర్వాత ప్లేఆఫ్స్, ఫైనల్ మ్యాచ్‌ల ద్వారా విజేతను నిర్ణయిస్తారు. ఆటగాళ్లను వేలం ద్వారా ఎంపిక చేయడం ఈ లీగ్ ప్రత్యేకత కాగా, యువ క్రికెటర్లకు తమ ప్రతిభను చూపించే మంచి వేదికగా నిలుస్తోంది. చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ వంటి జట్లు అభిమానులను ఆకట్టుకుంటూ పోటీని మరింత రసవత్తరంగా మార్చుతున్నాయి. ఈ ఏడాది ఐపీఎల్ పోటీలతో దేశవ్యాప్తంగా క్రికెట్ జోష్ నెలకొంది.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times, ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.